తల్లికి వందనం.. మీకో దండం !

- పిల్లలందరికీ అని చంద్రబాబు హామీ
- ఇప్పుడేమో తల్లికి రూ.15 వేలు మాత్రమేనంటూ తిరకాసు
- ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న తల్లుల ఆవేదన
- ఫీజులు కట్టాల్సిందేనంటున్న ప్రైవేట్ స్కూళ్లు

Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.

తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామంటూ పేర్కొన్న జీఓ

గోనెగండ్ల: ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ తల్లికి వందనం పేరిట రూ.15 వేలు చొప్పున ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆపై ఎన్నికల సమావేశాల్లోనూ ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతో సహా నాయకులందరూ ఇదే అంశాన్ని ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం నాలుక మడతేసింది. కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తల్లికి మాత్రమే పథకం అమలవుతుందని జీఓ జారీ చేసింది. అంతేగాక పలు నిబంధనలు విధించడంతో ఈ లెక్కన గత ప్రభుత్వంలో లబ్ధి పొందిన వారిలో 70 శాతం మందికి హుళక్కేననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రోజు రోజుకు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు చెల్లించాలని నిర్వాహకులు ఒత్తిడి తెస్తున్నారు. తల్లికి వందనం పథకంతో తమకు సంబంధం లేదని, ఫీజులు కట్టాల్సిందేనని ప్రైవేట్ యజమాన్యాలు నిక్కచ్చిగా చెబుతుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు దిక్కుతోచడం లేదు.

తప్పని కష్టాలు

యాజమాన్యాల ఒత్తిడితో అప్పులు చేసి పిల్లలకు ప్రైవేట్ బడుల్లో ఫీజులు కట్టారు. యూనిఫాం, పుస్తకాలు కొనిపెట్టారు. కొంతమంది తల్లిదండ్రులు ఈఎంఐకు ఒప్పుకున్నారు. ప్రభుత్వ బడికెళ్లే పిల్లల తల్లిదండ్రులు నోటుపుస్తకాలు, బట్టలు కొనిచ్చారు. తల్లికి వందనం ద్వారా రూ.15 వేలు చొప్పున ఇస్తారనే నమ్మకంతో అప్పులు చేశారు. అయితే ఇంతవరకు పథకంపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు.

ఎదురుచూపులు

గోనెగండ్ల మండలంలో 54 ప్రభుత్వ పాఠశాలల్లో 10200 మంది విద్యార్థులు ఉన్నారు. 9 ప్రైవేట్ పాఠశాలల్లో 1400 మంది చదువుతున్నారు. చదువుకునే విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం విడుదల చేసిన జీఓలో ఒక్కో తల్లికి రూ.15 వేలు అనే పదాన్ని పలుమార్లు ఉపయోగించారు. ఒకే తల్లికి ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే వాళ్ల పరిస్థితి ఏమిటి? పిల్లలు ఎందరు ఉన్నా రూ.15 వేలే ఇస్తారా? అనే ప్రశ్నలకు జీఓలో స్పష్టత లేకపోవడం తల్లిదండ్రులను గందరగోళానికి గురిచేస్తోంది. దీనికి తోడు అసలు డబ్బులు ఎప్పుడు బ్యాంకుఖాతాల్లో జమఅవుతాయో తెలియక ఎదురుచూపులు చూస్తున్నారు. పైగా ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించాలని, లేకుంటే పిల్లలను ఇంటికి పంపుతామని కొన్ని యాజమాన్యా లు ఒత్తిడి చేస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)



టీడీపీ మేనిఫెస్టోలో ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని స్పష్టంగా పేర్కొన్న దృశ్యం

పిల్లల చదువులు భారం



నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పిల్లలను గోనెగండ్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాం. ముగ్గురికీ ఫీజు కట్టలేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. యాజమాన్యం కూడా ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తోంది. ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు రూ.45 వేలు మంజూరు చేస్తే ఫీజు భారం తగ్గుతుందని భావించాం. ఇప్పటివరకు నగదు మంజూరు చేయకపోవడం, జీఓలో తల్లికి రూ.15 వేలు మాత్రమేనని పేర్కొనడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం వెంటనే పిల్లలందరికీ పథకాన్ని అమలు చేయాలి. – శైలజ, గోనెగండ్ల

నిధులు ఎప్పుడిస్తారు ?



మాది గోనెగండ్ల, నాకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. నలుగురు పిల్లలను చదివిస్తున్నాను. ప్రభుత్వం తల్లికి వందనం పథకం నలుగురికి రూ.60 వేలు అందిస్తే వారి చదువులకు ఢోకా ఉండదనుకున్నా. ఇప్పటివరకు ప్రభుత్వం పట్టించుకోలేదు. పిల్లల చదువులకు, బ్యాగులు, యూనిఫాం, నోట్‌బుక్‌లు, పుస్తకాలు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే తల్లికి వందనం సాయం మంజూరుచేస్తే పిల్లలకు కావలసిన విద్యా సామగ్రి కొనివ్వాలనుకుంటున్నా. నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో చెప్పాలి.

– రామేశ్వరి, గోనెగండ్ల

క్లుప్తంగా

వరుణుడి కరుణ కోసం పూజలు



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

నందవరం: వానదేవుడి కరుణ కోసం ఊరూరా పూజలు మొదలయ్యాయి. వర్షాలు కురవాలని కోరుతూ గ్రామ దేవతామూర్తులకు పవిత్ర జలాభిషేకాలు గావించడం, సప్త భజనలు చేయడం, ఏటి యాత్రలు వంటివి నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నందవరం మండలంలోని జొహరాపురంలో గ్రామ దేవతలు, దేవుళ్లకు జలాభిషేకాలు చేపట్టారు. ఊరి బొడ్రాయి, ఆంజనేయస్వామి, ఈశ్వర స్వాములకు 101 బిందెల నీటితో జలాభిషేకం చేశారు. గ్రామ సమీపంలోని తుంగభద్ర నది నుంచి నీటిని తీసుకొచ్చి అభిషేకాలు గావించారు. సాయంత్రం గ్రామస్తులు కలశాలతో ఊరిలోని దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు విజయ్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



విద్యార్థి హరికృష్ణను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో చదువుకున్న విద్యార్థి జి.హరిక్రిష్ణ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.రమేష్ నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థి హరికృష్ణను అభినందించారు. వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో హరికృష్ణ 568 మార్కులు సాధించి ఇడుపులపాయలోని ఆర్‌జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో ఆరేళ్లపాటు (ఇంటర్, బీటెక్) విద్య నభ్యసించేందుకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు గురురాజ, అబిదా బేగం, రామకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి



నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్‌ను చూపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాగరాజు, శశిధర్, సూరి, గణేష్ కోరారు. వారు శుక్రవారం కళాశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్ సంజన్నకు విన్నవించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసిందన్నారు. కొందరి నిర్లక్ష్యంతో ఆర్‌ఓ ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయని, వెంటనే బాగు చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే కళాశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్న పాఠ్య పుస్తకాలు అందించకపోవడం విచారకరమన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి పాఠ్యపుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు యశ్వంత్, రామంజి, శీను, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: మొక్కలను నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక భాష్యం పాఠశాలలో వన మహోత్సవం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. చెట్లు మనకు నీడనిస్తాయని, సకాలంలో వర్షాలు కురిపిస్తాయన్నారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: పట్టణంలో షెడ్యూల్ మెయింటెనెన్స్‌లో భాగంగా సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, చెట్ల కొమ్మలు తొలగించడం వంటి పనులు చేపడుతున్న సందర్భంగా 2వ శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు



కౌలు రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: అర్హులైన కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని కపటి గ్రామంలో కౌలు గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 19వ తేదీ వరకు ప్రతి గ్రామంలో కౌలు గుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ పంట సాగు హక్కు చట్టం–2019 సెక్షన్ 5(బీ) ప్రకారం కౌలు కార్డు ద్వారా పంట సాగుదారునకు ఆ కాల వ్యవధిలో పండిన పంటపై మాత్రమే హక్కు కల్పించడం జరుగుతుందన్నారు. కౌలు కార్డులు పొందిన వారికి పంటలకు మద్దతు ధర, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుతాయని వివరించారు. దరఖాస్తు చేసుకునేందుకు స్థానిక రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నర్సరీల్లో నిబంధనలు పాటించాలి



గోనెగండ్లలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారులు

గోనెగండ్ల: నర్సరీలు ఏర్పాటు చేసుకున్న యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం గోనెగండ్ల, హెచ్.కై రవాడి గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీ యజమానులు రిజిస్టర్, బిల్‌బుక్స్ తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఉల్లి పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఎమ్మిగనూరు ఉద్యానవన శాఖ అధికారిణి శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ మైత్రేయికి ఉత్తమ అవార్డు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి

ఎమ్మిగనూరురూరల్: పట్టణ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయికి జిల్లా ఉత్తమ డాక్టర్ అవార్డు వరించింది. జిల్లాలో అధికంగా 172 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడంతో ఆమెను ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌ఓ వై.ప్రవీణ్‌కుమార్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ మైత్రేయి, డాక్టర్లు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తనకు అవార్డు దక్కడం సంతోషంగా ఉందని డాక్టర్ మైత్రేయి చెప్పారు. ప్రజలు ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ మరమ్మతులకు నిధుల మంజూరు

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్ మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.14 లక్షల నిధులను శుక్రవారం విడుదల చేసింది. వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలుమార్లు సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రాలను అందించడంతో ప్రస్తుతం నిధులు మంజూరైనట్లు బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు తెలిపారు. ఈ నిధులను భవనం పైకప్పు, పిల్లర్ల మరమ్మతుల కోసం ఖర్చు చేయనున్నారు. భవనాన్ని పూర్తిస్థాయిలో బాగుచేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

మెరుగైన విద్యాబోధన అందించాలి

ఆదోని సెంట్రల్: విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యాబోధన అందించాలని దాత నాగరాజు స్వామి తెలిపారు. శుక్రవారం అర్ధగేరి బసవన గౌడ్ పురపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, కంపాక్స్, ప్లేట్స్ వంటివి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలోనే పిల్లలకు మంచి నడవడిక నేర్పాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున మాట్లాడుతూ దాత నాగరాజుస్వామి మూడేళ్లుగా విద్యా సామాగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల తరఫున దాతను సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా అందించాలి

పెద్దకడబూరు: రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం నాయకులు జాఫర్ పటేల్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కల్లుకుంట గ్రామంలో రేషన్ అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారని దీనిపై తహసీల్దారు, ఆర్‌ఐలకు సూచించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో 300 మందికి ఇప్పటికీ రేషన్ అందకపోవడంతో అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సురేష్‌బాబుకు సమర్పించారు. నాయకులు ఇస్మాయిల్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు పూర్తిచేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు – నేడు పనులు పూర్తి చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం నాడు – నేడు పథకం కింద పాఠశాలలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకొందన్నారు. ఆయా పనులు పూర్తి కాకపోవడంతో తరగతి గదుల కొరత, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం సత్వరం పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేసి ఆయా పనులను పూర్తి చేయాలని కోరారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



కౌతాళంలో పీర్ల పెట్టెలను ఊరేగింపుగా తీసుకొస్తున్న నిర్వాహకులు



కోసిగి పెద్ద మసీదు వద్ద చావిడిలో కొలువుతీరిన పీర్లు

కౌతాళం: హసన్, హుసేన్ త్యాగనిరతికి ప్రతీక మొహర్రం వేడుకలు కౌతాళంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొహర్రం నెలలో ఐదవ రోజున అన్ని చావిడిలలో పీర్లను ప్రతిష్టించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి పది గంటల వరకు ఆయా గ్రామాల్లోని చావిడిల్లో పీర్లను ప్రతిష్టించారు. కౌతాళంలోని హసన్, హుసేన్, ముల్లారు వీధి, పింజారిగేరి, అత్తరు వీధిలోని అక్బర్‌వలి, బారాఇమామ్ (అవ్వ,తాత)లను హాల్వీలో పీర్లను, బదినేహాల్, ఎరిగేరి, కామవరం, చిరుతపల్లి, సుళేకేరి, ఉప్పరహాల్, కుంటనహాల్ గ్రామాల్లో పీర్లను ప్రతిష్టించారు. ఆదివారం కౌతాళంలో చిన్న సరిగెత్తు ఉంటుందని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కొలువుదీరిన పీర్లు

కోసిగి: మండల కేంద్రంలోని పెద్ద మసీదు, కుమ్మరి వీధి, నూరాణి సున్నీ మసీదు సమీపంలోని చావిడిలలో పీర్లు కొలువుతీరాయి. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లోని చావిడిలలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించి పీర్లను కొలువుంచారు. మూగలదొడ్డి, చిన్నభూంపల్లి, వందగల్లు, చింతకుంట, పల్లెపాడు గ్రామాల్లో మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా అత్యంత వైభవంగా జరుపుకుంటారు. వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్ని గ్రామాల్లోని ప్రజలకు, చావిడి పెద్దలకు ఎస్‌ఐ సతీష్‌కుమార్ సూచనలు చేశారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కిశోర బాలికలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కోసిగి: కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు విజయకుమారి, కాత్యాయిని సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మానా సమక్షంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. బాలికలను రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కిశోర బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, చేతులను శుభ్రంగా కడుక్కున్న తర్వాతే అన్నం తినాలన్నారు. చిన్నపాటి జ్వరం, ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, రాముడు, అంగన్‌వాడీ కార్యకర్తలు హెప్సిబా రాణి, వరలక్ష్మి, మద్దమ్మ, భీమలింగమ్మ, దేవి, నాగవేణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది కలిగించొద్దు

కోసిగి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బంది కలిగించరాదని ఆదోని డిపో మేనేజర్ రఫీక్, ఎస్‌ఐ సతీష్‌కుమార్ సూచించారు. శుక్రవారం కోసిగి ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశీలించి, వ్యాపారులకు సూచనలు చేశారు.ఆర్టీసీ బస్టాండ్‌లో చిరు వ్యాపారులు నేరేడు పండ్ల విక్రయాలు చేపడుతూ ప్రయాణికులకు, బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. అలాగే బస్టాండ్ ప్రాంగణంలోనే ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారడం చూసి వారు శుక్రవారం చిరు వ్యాపారస్తులకు సూచనలు చేశారు. బస్టాండ్ ప్రాంగణంలో విక్రయాలు చేపట్టరాదని, వాహనాలను అడ్డదిడ్డంగా నిలపరాదని ఆదేశించారు. ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఉన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన సామగ్రి

ఆదోని అర్బన్: పట్టణంలోని విజయనగర్ కాలనీలో శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు ఎగసిపడడంతో గుడిసె దగ్ధమైంది. కాలనీలో కాంతారావు అనే వ్యక్తి 30 సంవత్సరాల నుంచి కుటుంబంతో గుడిసెలో జీవనం సాగిస్తున్నారు. ఆ గుడిసె పక్కనే విద్యుత్ స్తంభానికి తీగలు భారీ స్థాయిలో వేలాడుతున్నాయి. బలమైన గాలులకు విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగలడంతో నిప్పురవ్వలు ఏర్పడి గుడిసెపై పడ్డాయి. దీంతో నిప్పంటుకుని ఇంట్లోని టీవీ, ఫ్రిడ్జ్, కూలర్, బట్టలు, ఫ్యాన్, బీరువా కాలిపోయాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.3 లక్షల దాకా ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోయారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పరామర్శించారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి స్తంభానికి అడ్డదిడ్డంగా ఉన్న వైర్లను తొలగించాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తానని చెప్పారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌పై విచారణ

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌పై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం కౌతాళం మండల విద్యాధికారి శోభారాణి, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలీమ్ సిద్ధిఖీ స్థానిక మండల రిసోర్స్ కేంద్రంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులును విచారించారు. పట్టణంలోని ఆది ఆంధ్ర పురపాలక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న శ్రీనివాసులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించి ఉద్యోగంలో చేరినట్లు తెలియడంతో ఏప్రిల్ 23వ తేదీన అధికారులు సస్పెండ్ చేశారు. ఈ విషయంపై అధికారులను విచారణకు ఆదేశించారు. వారు శుక్రవారం విచారణ చేపట్టి ఒరిజినల్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం చూపించాల్సిందిగా శ్రీనివాసులును కోరారు. తన ఒరిజినల్ సర్టిఫికెట్లు కోర్టులో ఉన్నాయని, కోర్టు నుంచి తనకు అందిన తర్వాత సమర్పిస్తానని, లేనిపక్షంలో ఎంఆర్‌ఓ కార్యాలయం నుంచి తీసుకొని సమర్పిస్తానని శ్రీనివాసులు చెప్పినట్లు వారు వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



బాలుర హాస్టల్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న బాలికల, బాలుర సంక్షేమ హస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలోని ఆయా హాస్టళ్లను పరిశీలించారు. అంతకుముందు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పలు కో–ఆపరేటివ్ సొసైటీల సీఈఓలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం హాస్టళ్లను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు

ఎమ్మిగనూరుటౌన్: నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో బాలికను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. 8 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. బాలిక కుటుంబానికి న్యాయం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. స్థానిక ఏపీ మహిళా సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ముచ్చుమర్రి గ్రామంలో బాలికపై అత్యాచారం చేసి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం గోనెగండ్లలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిశ, నిర్భయ చట్టాలు తీసుకొచ్చినా దేశవ్యాప్తంగా చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కంది విత్తనాల పంపిణీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

గోనెగండ్ల: బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో అపరాల– ఆదర్శ గ్రామ పథకం కింద రైతులకు పీఆర్‌జీ–176 రకం కంది విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అశోక్‌కుమార్, వ్యవసాయ అధికారులతో కలిసి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంది పంటను వర్షాధారం కింద జూలై చివరి వరకు విత్తుకోవచ్చునని తెలిపారు. ఈ రకం విత్తనాలు పంట చివరి దశలో బెట్టను తట్టుకోగలవని చెప్పారు. ఎకరానికి 4 కిలోల విత్తనం సరిపోతుందని, సాళ్ల మధ్య 90 సెం.మీ. దూరం, వరుసలో మొక్కల మధ్య దూరం 20–30 సెం.మీ ఉండాలని వివరించారు. అలాగే ఎకరానికి 8 కేజీల నత్రజని, 20 కేజీల భాస్వరం వేసుకోవాలని సూచించారు. ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత మాట్లాడుతూ.. విత్తనం మొలకెత్తినప్పటి నుంచే సమగ్ర సస్యరక్షణ చేపట్టడం ద్వారా చీడ, పీడల ఉధృతిని తగ్గించి అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కేవీకే శాస్త్రవేత్త నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ చిన్న జీవాలలో వచ్చే చిటుక వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని పాడిరైతులకు సూచించారు. ఏఈఓ శ్రీహరి, వీఏఏ మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.